మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
7 PM
ఆదివారం 18 అక్టోబర్ 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVAANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..

## ముగిసిన నామినేషన్ల

# గడువు



- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. - మిగతా3లో

## అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం

పవర్‌లిఫ్టింగ్‌లో 3 స్వర్ణాలు!

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు గెల్చిన ఏక్తా బిష్ణోయ్

ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా రికార్డు

కోచ్ వీసా తిరస్కరణకు గురవడంతో వీడియో కాల్ ద్వారా సూచనలు

మొత్తం 362.5 కిలోల బరువు ఎత్తి జపాన్, కెనడా క్రీడాకారులపై విజయం





### భారత్ ఆగ్రహం..

## దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్

- తప్పు తనదేనన్న జేడీ వాన్స్!
- హెచ్-1బీ వీసాదారులపై చేసిన 'బానిసలు' వ్యాఖ్యలపై వాన్స్ వివరణ
- నా మాటలు సరికావు, ఆ తప్పు తనదేనని అంగీకరించిన వైనం
- భారత్ నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైన తర్వాత ఉపాధ్యక్షుడి స్పందన

## ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?

- జగన్‌కు అచ్చెన్నాయుడు కౌంటర్
- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు
- 2020 స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్
- నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలం తగ్గింపు ఆర్డినెన్స్‌ను గుర్తు చేసిన మంత్రి
- బెదిరింపుల వల్లే నాడు ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిందని వెల్లడి



**అమరావతి**

ప్రజాస్వామ్యం గురించి నేడు మాట్లాడుతున్న జగన్, వారి హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అరాచకాలకు ముందుగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై జరిగిన దాడులను, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను గుర్తు చేస్తూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నేడు ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగం గురించి - మిగతా3లో



## ఎన్హెచ్ఎం ఉద్యోగుల

# జీతాల్లో కోత

### ప్రభుత్వంపై కవిత ఫైర్

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

**హైదరాబాద్**

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల - మిగతా3లో

## ఈసీ వెంటనే జోక్యం చేసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠాను కలిసిన జగన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యాలకు పాల్పడుతోందంటూ ఫిర్యాదు

నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ

టీడీపీ కార్యకర్తలకు పోలీసులు సహకరిస్తున్నారని ఫిర్యాదు





## ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు

# వసూలు

- టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్
- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్
- టోమ్‌కామ్ ఫీజులు, ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి

## ఈ సారి ఫిబ్రవరిలోనే

# పీక్ సమ్మర్

- 125 ఏళ్ల తర్వాత మళ్లీ రిపీట్..
- భయపెడుతున్న వెదర్ రిపోర్ట్
- ఎప్పుడూ లేని విధంగా డిసెంబర్ నుంచే ఎండలు చురుకెక్కి.. ఫిబ్రవరి వచ్చేసరికే అసలుసిసలు మిడ్ సమ్మర్ ఉక్కబోత షురూ
- ఎల్‌నినో ఎఫెక్ట్‌తో కాలచక్రంలో తీవ్ర గందరగోళం నెలకొందని వెదర్ ఎక్స్‌పర్ట్స్ అంచనా
- ఈ అంచనాలు జనాల్లో తీవ్ర భయాందోళనకు రేకెత్తిస్తున్నాయి



**హైదరాబాద్**

నార్మల్‌గా ఎండాకాలం మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ప్రారంభమవుతుంది. కానీ ఈసారి వాతావరణ పరిస్థితులు పూర్తిగా తారుమారు కానున్నాయి. ఎండల తీవ్రత అనుకున్న సమయం కంటే ముందే మొదలుకానుంది. క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం.. ఈసారి ఎండాకాలం ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యే అవకాశముందని హెచ్చరికలు వెలువడ్డాయి. దీనికి ప్రధాన కారణం ఎల్‌నీనో ప్రభావమేనని వాతావరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నీనో ప్రభావంతో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ భారీగా పెరిగి, దేశంలోని వాతావరణ సమతుల్యతను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఎల్‌నీనో ప్రభావం వల్ల ప్రస్తుతం చలికాలం కొనసాగుతున్నప్పటికీ భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధ్యయనాల ప్రకారం, 1901 తర్వాత గత ఆగస్టు నెల అత్యంత వేడి నెలల్లో ఒకటిగా నిలిచింది. రాబోయే రోజుల్లో దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉండనుందన్న అంచనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వానాకాలం ముఖం చాటేయగా, చలికాలం కనీసం పలకరించకుండానే సగానికే ముగిసేలా ఉంది. - మిగతా3లో

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ఆదివారం 18 అక్టోబర్ 2026

# ప్రభుత్వ టీచర్ పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి.

## నగదు,మొబైల్ తో పాటు... విలువైన రికార్డులు అపహరణ.

**గోరంట్ల :** గోరంట్ల పట్టణ సమీపంలోని గుమ్మయగారిపల్లి నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఆదివారం సాయంత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయ వెంకటేష్ పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది.బాధితులు వెంకటేష్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. బాధితులు టీచర్ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి గోరంట్ల మండలంలోని భూగానపల్లి గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ ఇదే మండలంలోని కాలేకుంటపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ పట్టణంలోని బృందావనం కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గోరంట్ల పటం నుండి తన స్వగ్రామమైన భోగానపల్లికి వెళ్లేందుకు తన ద్విచక్ర వాహనం లో వెళుతుండగా గుమ్మయ్య గారి పల్లి గ్రామ సమీపంలో వినువైపు నుంచి మరో ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వస్తూ తన ద్విచక్ర వాహనం సమీపంలో వారి వాహనం ప్రమాదానికి లోనైనట్టుగా నటించి కిందపడబోతుండగా అది గమనించి వారిని కాపాడేందుకు వెళితే ఒకసారి గా నాపై దాడి చేసి నా దగ్గర ఉన్న డబ్బు మొబైల్ బ్యాంకు ఎటిఎం కార్డు తదితర విలువైన రికార్డులను లాక్కొని పరారయ్యారని వాపోయాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు



## ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతున్న జగన్ గారిని నేను ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2020లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు, మీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ముందు సమాధానం చెప్పండి. ఆ తర్వాతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకు ఉంటుంది. ఆనాడు మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్ధా వెంకన్నల వాహనంపై మీ పార్టీ శ్రేణులు దాడి చేసినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా? పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేసినప్పుడు రాజ్యాంగం ఏమైంది? మీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్నారని వచ్చిన వేలాది ఫిర్యాదులకు మీ దగ్గర సమాధానం ఉందా? వీటన్నిటికీ జవాబు చెప్పకుండా ఈరోజు మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు కదా? మరి నాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఆ చర్యను హైకోర్టు తప్పుబడుతూ కొట్టివేసిన విషయం మర్చిపోయారా? మీ హయాంలో బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ద్వారా ఏకగ్రీవాలు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందో చెప్పాలి. మీ పార్టీ నాయకుల దాడులు, బెదిరింపులతో మా కార్యకర్తల ప్రాణాలు కాపాడుకోవడమే గగనమైంది. అందుకే, తప్పనిసరి పరిస్థితుల్లో మేము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చింది. ఈ విషయం మీరు మర్చిపోయినా, ప్రజలు మర్చిపోలేదు. మిథున్‌రెడ్డి ఘటనతో సహా అన్ని ఎన్నికల హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానమే. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను" అని స్పష్టం చేశారు.

## అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం..

ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు. ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు. గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్క్వాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం" అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..
## ముగిసిన నామినేషన్ల గడువు

-మొదటిపేజీ తరువాయి

ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

### దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

### తదుపరి షెడ్యూల్ ఇదే

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

## ఈసీ వెంటనే జోక్యం చేసుకోవాలి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆయన ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనివ్వకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు భౌతికంగా అడ్డుకుంటున్నారని జగన్ ఆరోపించారు. కొన్నిచోట్ల రిటర్నింగ్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ పత్రాలు స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ గూండాలకు పోలీసులే పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని జగన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నేటితో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రిటర్నింగ్ అధికారులు, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జగన్ ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

## ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు.

## 15 వార్డు కౌన్సిలర్ గా గొల్ల హెమావతిహరికృష్ణ.

,:-అభివృద్ధి సంక్షేమమే తమ ధ్యేయం.



**పెనుకొండ :** అభివృద్ధి సంక్షేమ మే తన ధ్యేయమని 15వ వార్డుకు నామినేషన్ వేసిన గొల్ల హెమావతిహరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం 15వ వార్డుకు తమ నామినేషన్ పత్రాలను చైర్మన్ అభ్యర్థి త్రివేంద్ర మూర్తితో కలిసి దాకలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి సవిత సహకారం తో వార్డు ను అభివృద్ధి
బాటలో నడిపిస్తానన్నారు.తమను అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తే చైర్మన్ అభ్యర్థి త్రివేంద్ర మూర్తి సహకారంతో వార్డు లో అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

## మడకశిర డిపోలో ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ధర్నా కార్యక్రమం



**మడకశిర :** సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీలో 1/2019 సర్కులర్ తప్పకుండా అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్లకు నిరసనగా ఎన్ఎంయుఏ మడకశిరడిపో సెక్రెటరీ కరియప్ప అధ్యక్షతన గేట్ మీటింగ్ ధర్నా ఆదివారం కార్యక్రమం ఓజరిగినది. 18- 10 -2026 ఆదివారం ఉదయం 11 గంటలకు మడకశిర డిపో గేటు దగ్గర జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో కరియప్ప తో పాటు చైర్మన్ ముద్దప్ప గ్యారేజ్ సెక్రెటరీ బాబు ఆర్గనైజర్ జయసింహ కండక్టర్లు నారాయణ, కార్తీక్ , డ్రైవర్లు సురేష్, అబ్బాస్ దాదా, పీర్ నాగరాజు, చెన్న రాయప్ప ,పాపన్న, గ్యారేజ్ నుండి రసూల్ బాబ్జాన్, నరేష్, వీరితోపాటు ఎస్ డి ఐ షబ్బీర్ పాల్గొన్నారు.

## మడకశిర మున్సిపల్ చైర్మన్ బరిలో కూటమి అభ్యర్థి ఆవుల శ్రీనివాసులు



**మడకశిర :** జనసేన పార్టీ తరఫున నాలుగో వార్డు నుంచి నామినేషన్ దాఖలు మడకశిర మున్సిపల్ చైర్మన్ బరిలో కూటమి అభ్యర్థి ఆవుల శ్రీనివాసులు. జనసేన పార్టీ తరఫున నామినేషన్ దాఖలు సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు సందర్భంగా రాజకీయ సందడి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమి తరఫున జనసేన పార్టీ అభ్యర్థిగా నాలుగో వార్డుకు చెందిన ఎస్ఈ శ్రీనివాసులు నామినేషన్ దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో నామినేషన్ల ప్రక్రియకు ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి అభ్యర్థిగా శ్రీనివాసులు బరిలోకి దిగడంతో మడకశిర మున్సిపాలిటీ రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల మధ్య పోటీ రసవత్తరంగా మారుతున్నది.

## భారత్ ఆగ్రహం.. దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్..

హెచ్-1బీ వీసాదారులను 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' (ఒప్పంద బానిసలు) అని సంబోధిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆ పదప్రయోగం సరికాదని అంగీకరించారు. తన విమర్శ ఉద్యోగులను ఉద్దేశించి కాదని, అమెరికా కంపెనీలు అనుసరిస్తున్న వీసా విధానాలను లక్ష్యంగా చేసుకుని మాత్రమే అని స్పష్టం చేశారు. భారత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సీబీఎస్ నిర్వహించిన ఒక టౌన్‌హాల్ కార్యక్రమంలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. "నా మాటలు సరైనవి కావు, ఆ తప్పు నాదే" అని అంగీకరించారు. అమెరికన్లతో భర్తీ చేయలేని ఉద్యోగాలని చెప్పి, విదేశీ నిపుణులను నియమించుకుంటున్న కంపెనీల గురించే తాను మాట్లాడానని వివరించారు.
వీసాపై ఆధారపడి పనిచేయడం వల్ల ఉద్యోగులు యాజమాన్యాల చేతిలో శక్తిహీనులుగా మారుతున్నారని, ఉద్యోగం పోతే తమ దేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తుందన్న భయంతో వారు ఫిర్యాదు చేయడానికి కూడా సాహసించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ బలహీనతను కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని వాన్స్ ఆరోపించారు. ఈ నెల ప్రారంభంలో వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' అనే పదం అత్యంత అవమానకరమని, దీని వెనుక బాధాకరమైన చారిత్రక, వలసవాద నేపథ్యం ఉందని భారత్ స్పష్టం చేసింది. భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, నైపుణ్యం కలవారని, వారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణలకు ఎనలేని సేవలందిస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తుచేసింది. తరతరాలుగా వలస వచ్చిన వారి వల్లే అమెరికా చరిత్ర రూపుదిద్దుకుందన్న విషయాన్ని కూడా నొక్కి చెప్పింది. కొన్ని ఐటీ సంస్థలను గ్రీన్ కార్డ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా జేడీ వాన్స్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ నిపుణులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.
ఈ వ్యాఖ్యలు భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. తాజాగా వాన్స్ వివరణతో ఈ వివాదం కొంత సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

## ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత..
## ప్రభుత్వంపై కవిత ఫైర్

-మొదటిపేజీ తరువాయి

కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

## సాలూరులో విచిత్ర రాజకీయం..
## జనసైనికులకు ఊహించని షాక్..!

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు పురపాలక సంఘంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. స్థానిక జనసైనికులకు పార్టీ అధిష్ఠానం ఊహించని నిర్ణయంతో షాక్ ఇచ్చింది. ప్రతిపక్ష వైసీపీలో కొనసాగుతున్న నాయకురాలికే జనసేన పార్టీ తరఫున చైర్‌పర్సన్ టికెట్‌ను కేటాయించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ అనూహ్య పరిణామంతో అటు టీడీపీ, ఇటు జనసేన స్థానిక శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన గొర్లె విజయకుమారి, 2023 తర్వాత తన భర్తతో కలిసి వైకాపాలో చేరారు. అయితే, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఆమెకు టికెట్ నిరాకరించింది. ఈ నేపథ్యంలో, ఆమెకు అనూహ్యంగా జనసేన నుంచి చైర్‌పర్సన్ అభ్యర్థిత్వం ఖరారు కావడం గమనార్హం.
అయితే, విజయకుమారి ఇప్పటివరకు వైసీపీకి అధికారికంగా రాజీనామా చేయలేదు. అలాగే జనసేన పార్టీలో సభ్యత్వం కూడా తీసుకోలేదు. అయినప్పటికీ ఆమెకు టికెట్ కేటాయించడం కూటమిలో రాజకీయ దుమారం రేపుతోంది. జనసేన అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయంపై టీడీపీ, జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయకుమారికి తాము సహకరించేది లేదని తెలుగుదేశం శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, పార్టీ అధిష్ఠానం తన వైఖరి మార్చుకోకపోతే తామంతా మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమని స్థానిక జనసేన నాయకులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం సాలూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ నాగబాబు, 32 కౌన్సిలర్ స్థానాల్లోనూ నామినేషన్లు వేయాలని సూచించారని.. అటువంటిది తమతో కనీస సంప్రదింపులు జరపకుండా చైర్‌పర్సన్ టికెట్‌ను ఎలా ప్రకటిస్తారని స్థానిక నేతలు నిలదీస్తున్నారు. ఈ పరిణామాలతో సాలూరులో కూటమి పొత్తుల రాజకీయాలు గందరగోళంలో పడ్డాయి.

## ఈ సారి ఫిబ్రవరిలోనే పీక్ సమ్మర్



-మొదటిపేజీ తరువాయి

అయితే ఎప్పుడూ లేని విధంగా డిసెంబర్ నుంచే ఎండలు ముదురుతున్నాయి. ఫిబ్రవరి నాటికే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి మే నెల నాటి మిడ్ సమ్మర్ ఉక్కబోతను తలపించే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా మార్చి నెలలో అనూహ్యంగా కోల్డ్‌వేవ్ కూడా ఉండవచ్చని వెదర్ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారు.

### విద్యుత్ కోతలతో అన్నదాతల పోరుబాట

ఇక ఎల్‌నినోతో వర్షాలు లేకపోవడం.. పంటలకు నీరు అందించాల్సిన సమయంలో నెలకొన్న విద్యుత్ కోతలు తెలంగాణ అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అప్రకటిత కరెంట్ కోతలపై రైతులు ఆందోళన బాట పట్టారు. పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి, దోమకొండ, సదాశివనగర్, బిక్కనూర్ మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయి. కేవలం ఐదారు గంటలు మాత్రమే త్రీ-ఫేస్ కరెంట్ సరఫరా అవుతుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట నిరసనలకు దిగుతున్నారు.

### మూడు జిల్లాలకు తాగునీటి ముప్పు

మరోవైపు సాగునీటి సమస్యే కాకుండా, తాగేందుకు గ్లాసు మంచినీళ్లు కూడా దొరకని దుస్థితి దాపరించింది. సింగూర్, మంజీరా ప్రాజెక్టులలో నీటిమట్టాలు పూర్తిగా అడుగంటిపోవడంతో సంగారెడ్డి, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు తాగునీటి ముప్పు ముంచుకొస్తోంది. అసలు సింగూర్‌లో నీళ్లు ఎందుకు అడుగంటిపోయాయి? ఈ నీటి సంక్షోభం ఎంతవరకు దారితీయనుంది? అనే ఆందోళనలు ప్రజల్లో పెరిగిపోతున్నాయి.